
సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 11 । జనవరి । 2023



కారుతో ఢీకొట్టి..ఆపై దాడి చేసి..

బైక్‌పై వెళ్తున్న వారిని కార్పొరేటర్ భర్త కారుతో ఢీకొట్టి ఆపై దాడి చేసిన ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

8లో▸

అక్రమ రవాణాపై ఆర్టీఏ కొరడా

సాక్షి, సిటీబ్యూరో: నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ప్రైవేట్ వాహనాలపై రవాణాశాఖ కొరడా ఝుళిపించింది. సంక్రాంతి రద్దీ దృష్ట్యా ప్రయాణికులను తరలించే వాహనాలపై అధికారులు దృష్టి సారించారు. ఆర్టీసీ సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు జేటీసీ పాండురంగ నాయక్ తెలిపారు. ఎల్‌బీనగర్, ఆరాంఘర్ చౌరస్తా, జూబ్లీ బస్‌స్టేషన్ ప్రాంతాల్లో మంగళవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

నేడు మహిళా పారిశ్రామిక వేత్తలకు అవార్డుల ప్రదానం

మణికొండ: మహిళా పారిశ్రామికవేత్తలకు హైదరాబాద్ బిజినెస్ అవార్డులను బుధవారం ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రదానం చేస్తారని ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో) సంస్థ పేర్కొంది. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని అడ్రస్ కన్వెన్షన్‌లో సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుంది. గౌరవ అతిథిగా నీతి ఆయోగ్ మాజీ సీఈఓ, షెర్పా అమితాబ్‌కాంత్ హాజరవుతారు.

న్యూస్‌రీల్

పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: పీఆర్‌టీయూ తెలంగాణ డైరీని మంగళవారం కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సత్తారి రాజిరెడ్డి, మహేశ్వరం మండల విద్యాధికారి కృష్ణ, ఏపీఓ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌కుమార్, శివకుమార్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్

మహేశ్వరం: మహేశ్వరం మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి 6,7,8,9,10 తరగతులకుగాను ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైనట్లు స్కూల్ ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్ పేర్కొన్నారు. 6వ తరగతిలో 100 సీట్లకు 7 నుంచి 10వ తరగతిలో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. టీఎస్ ఆన్‌లైన్ లేదా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 10 నుంచి ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఓసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ విద్యార్థులు రూ.125 రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. హాల్ టికెట్లను ఏప్రిల్ 8 నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 16న ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

'108'లో పైలెట్, ఈఎంటీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

కందుకూరు: 108 అంబులెన్స్‌లో పైలెట్, ఈ ఎంటీ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సీహెచ్ నరేందర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో హయత్‌నగర్ 108 కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పైలెట్ ఉద్యోగానికి పదో తరగతి ఉత్తీర్ణులై, వయస్సు 23–35 ఏళ్ల మధ్య ఉండి, ఎల్‌ఎంవీ (బ్యాడ్జ్) కలిగి ఉండాలన్నారు. ఈఎంటీ ఉద్యోగానికి బీఎస్సీ (లైఫ్ సైన్స్)ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ అర్హతలు ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ సెట్‌తో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

రైతు హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యదర్శిగా ఇస్మాయిల్



హుడాకాంప్లెక్స్: తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యదర్శిగా షేక్ సలార్ ఇస్మాయిల్ గురూజీ నియమితులయ్యారు. ఈ మేరకు సరూర్‌నగర్‌లోని హుడా కాంప్లెక్స్‌లో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్, రాష్ట్ర అధ్యక్షుడు బాలుయాదవ్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ గురూజీ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రైతు కోసం పోరాటం, రైతు కోసం ఆరాటం అనే నినాదంతో ఏర్పడిన తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి కార్యదర్శిగా నియమితులవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ అనుబంధ రంగాల అధ్యక్షుడు జింకల యాదయ్య యాదవ్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి టేకుల మంజులారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సబితారెడ్డి, ఎన్ఆర్ఐ విభాగం గోవర్ధన్, శ్రీలక్ష్మి, నిషారెడ్డి, కిషోర్‌యాదవ్, రాజు, ఆరూరి నరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని మన్నెగూడ బీఎంఆర్ సార్థ కన్వెన్షన్‌లో ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించే టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను మంగళవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య, కార్యదర్శి గాలయ్య, జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్, నాయకులు రామలయ్య, గణేశ్, రాములు, జగన్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల.. మరింత వెలిగేలా..

- పీఎంశ్రీ పథకానికి కేంద్రం శ్రీకారం
- జిల్లాలో అర్హత సాధించిన 380 స్కూళ్లు
- పూర్తయిన దరఖాస్తు ప్రక్రియ
- మండలానికి రెండు చొప్పున సెలక్ట్
- ఎంపికైతే మారనున్న రూపురేఖలు



రామచంద్రాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

కొందుర్గు: సర్కారు బడులను బలోపేతం చేసి గ్రామీణ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు కార్పొరేట్‌స్థాయిలో సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం 2021–22 యూడైస్ ఆధారంగా సొంత భవనం, ఫైర్ సేఫ్టీ పరికరాలు, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ అధికంగా ఉండటం, బాలురు, బాలికలు వేర్వేరు టాయ్‌లెట్స్ కలిగి ఉండటం, తాగునీటి సౌకర్యం, హ్యాండ్‌వాష్ సదుపాయం, విద్యుత్ సౌకర్యం, గ్రంథాలయం, ఆటవస్తువులు, ఉపాధ్యాయుల గుర్తింపు కార్డులు కలిగి ఉన్న పాఠశాలల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. 2022 డిసెంబర్ 31తో దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. జిల్లా నుంచి ఈ పథకానికి 380 పాఠశాలలు అర్హత సాధించడంతో అన్ని పాఠశాలల నుంచి దరఖాస్తులు అందినట్లు జిల్లా అధికారులు తెలిపారు.

ఎంపికైతే ఏటా రూ.40 లక్షలు

జిల్లాలో మొత్తం 27 మండలాలకు సంబంధించి 881 ప్రాథమిక, 180 ప్రాథమికోన్నత, 247 జిల్లా పరిషత్, 7 మోడల్, 20 కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయి. ఎయిడెడ్, ఇతర పాఠశాలలు కలిపి మరో 85 ఉన్నాయి. దాదాపు 1.80 లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు. పీఎంశ్రీ పథకానికి దరఖాస్తు చేసుకున్న 380 పాఠశాలల నుంచి మండలానికి రెండు చొప్పున 54 స్కూళ్లను ఎంపిక చేస్తారు. ఎంపికైన పాఠశాలకు రాబోయే విద్యాసంవత్సరం (2023–24) నుంచి ఏటా రూ.40 లక్షల లెక్కన ఐదేళ్లకు రూ.2 కోట్లు మంజూరు చేసి అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. ఈ పథకానికి ఏ పాఠశాలలు ఎంపికవుతాయో వేచి చూడాలి.

నాణ్యమైన విద్య కోసం



సర్కారు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడం, మన ఊరు మనబడి లాంటి కార్యక్రమాలు చేపడుతుండగా కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని తెచ్చింది.

– కిష్టారెడ్డి, ఎంఈఓ, కొందుర్గు

అమలు చేయడం మంచిదే..



ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమైన విషయం. అన్నీ అమలులోకి వస్తే రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి. ఆచరణలో ఎలా ఉంటుందో చూడాలి.

– శివారెడ్డి, హెచ్ఎం, పీఎస్ చెర్కుపల్లి, కొందుర్గు మండలం

'కంటివెలుగు'ను విజయవంతం చేయండి



మొయినాబాద్ పీహెచ్‌సీలో జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు

మొయినాబాద్: కంటి వెలుగు కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మొయినాబాద్‌లో మంగళవారం వైద్యాధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. అదే విధంగా జాతీయ ఆరోగ్య ప్రమాణాల భద్రత సంస్థ ప్రతినిధులు మొయినాబాద్ పీహెచ్‌సీని సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, వైద్యానికి అవసరమైన కిట్లు, మందులు, సిబ్బంది ఉన్నారా అనే విషయాలను తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ నెల 18 నుంచి కంటి వెలుగు కార్యక్రమం మొదలవుతుందని తెలిపారు. 18 సంవత్సరాలు పైబడినవారందరికీ పరీక్షలు నిర్వహించాలని.. అవసరమైన వారికి అద్దాలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల ఉప వైద్యాధికారి దామోదర్, మండల వైద్యాధికారులు శ్రీనివాస్, వాణి, సీహెచ్‌ఓ నర్సింగ్‌రావు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

ఆ భూములపై విచారణ జరిపించాలి



కలెక్టర్ అమయ్‌కుమార్‌కు మంత్రి లేఖ పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని రావిర్యాల కొంగరకుర్దు భూములకు సంబంధించి వస్తున్న ఆరోపణలపై విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి మంగళవారం స్పందించారు. భూములపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలతో కూడిన నివేదిక అందజేయాలని, బాధిత రైతు కుటుంబాలకు న్యాయం చేయాలని కలెక్టర్, రాచకొండ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు కలెక్టరేట్‌లో కలెక్టర్ అమయ్‌కుమార్‌ను కలిసి మంత్రి రాసిన లేఖ పత్రాన్ని అందజేశారు. లేఖను అందజేసిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ భవాని వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు రవినాయక్, నాయకులు బూడిద శ్రీకాంత్, సప్పిడి రాజు, శ్యామేల్ రాజు, పద్మ, నర్సింహారెడ్డి ఉన్నారు.

'మల్‌రెడ్డి' మాకొద్దు



ఆదిబట్లలోని ఈసీ శేఖర్‌గౌడ్ వ్యవసాయ క్షేత్రంలో సమావేశమైన కాంగ్రెస్ సీనియర్ నాయకులు

- ఆయనతో కాంగ్రెస్‌కు నష్టమే..
- పార్టీ ఇబ్రహీంపట్నం సీనియర్ నాయకుల స్పష్టీకరణ
- కొత్త నాయకత్వం కోసం అధిష్టానానికి విన్నపం

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మల్‌రెడ్డి రంగారెడ్డితో కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందని.. కొత్త నాయకుడు కావాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని ఈసీ శేఖర్‌గౌడ్ వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం పార్టీ సీనియర్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈసీ శేఖర్‌గౌడ్, కొత్తకుర్మ శివకుమార్, దండెం రాంరెడ్డి, మర్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. 40 సంవత్సరాలుగా ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. మల్‌రెడ్డి రంగారెడ్డితో కార్యకర్తలు నిరుత్సాహంగా ఉన్నారని తెలిపారు. కోదండరెడ్డి నాయకత్వంలో పని చేస్తామని స్పష్టం చేశారు. మూడుసార్లు కాంగ్రెస్ పార్టీ నుంచి ఓడిపోయిన రంగారెడ్డి కాకుండా మరెవరికైనా నాయకత్వం ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దెంది రాంరెడ్డి, గుండ్ల వెంకట్‌రెడ్డి, త్యాలపల్లి కృష్ణ, కొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పండాల శంకర్‌గౌడ్, ఆదిబట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, బండలేమూర్ సర్పంచ్ మంగ శ్రీనివాస్, కౌన్సిలర్ హరిదాస్‌గౌడ్, కుర్మిద్ద యాదయ్య, సామెల్, అలీబాయ్, కృష్ణ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. ఏమైందో ఏమో!

- కూలి పనుల కోసం వచ్చి విగతజీవులుగా మారి..
- అనుమానాస్పద స్థితిలో వృద్ధ దంపతుల మృతి





హనుమంతు, వెంకటమ్మ (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: కూలి పనికోసం వలస వచ్చిన వృద్ధ దంపతులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. రాత్రి పడుకున్న మంచంపైనే తెల్లవారేసరికి విగతజీవులుగా మారారు. ఈ విషాదకర సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన నాగారం హనుమంతు (65), భార్య వెంకటమ్మ (50)తో కలిసి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్‌లో సుగుణ అనే మహిళా రైతు వద్ద హార్టికల్చర్ పనులు చేస్తూ అక్కడే నివసిస్తున్నారు. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి నిద్రకు ఉపక్రమించారు. మంగళవారం ఉదయం ఇంకా ఇంట్లోంచి బయటకు రాకపోవడంతో సుగుణ వారిని పిలిచేందుకు వెళ్లింది. లోపలి నుంచి గడియపెట్టి ఉండడంతో పాటు దంపతులిద్దరూ స్పందించకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని గ్రామస్తులకు చెప్పింది. దీంతో కొంతమంది వచ్చి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా హనుమంతు దంపతులు మంచంపై విగతజీవులుగా కనిపించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి, క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. మృతుల కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

బాలికల భవిష్యత్తుకు పెద్దపీట



చంద్రాయనపల్లిలో కేజీబీవీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

మోమిన్‌పేట: బాలికల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని చంద్రాయన్‌పల్లిలో రూ.2.05 కోట్లతో నిర్మించిన కేజీబీవీ నూతన భవనాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాలికల విద్యాభివృద్ధికి కోసం గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, కస్తూర్బా పాఠశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కేజీబీవీల్లో ఇంటర్ తరగతులు ప్రవేశపెట్టామని స్పష్టంచేశారు. జిల్లాలోని కస్తూర్బాగాంధీ స్కూళ్ల మరమ్మతుల కోసం రూ.4 కోట్లతో అంచనాలు సిద్ధం చేశామని వివరించారు. బాలికల చదువుపై దృష్టి పెట్టి ప్రైవేటుకు దీటుగా ఇంజనీరింగ్, మెడికల్ సీట్లు సాధించాలని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నిష్ణాతులైన సిబ్బంది ఉంటారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకే మనబడి కార్యక్రమం ద్వారా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, డీఈఓ రేణుకాదేవి, సర్పంచు అంజయ్య, ఎంపీపీ వసంత వెంకట్, వైస్ ఎంపీపీ మానస, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ శైలజారెడ్డి, బీఆర్ ఎస్ మండల అధ్యక్షుడు డి.వెంకట్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వింటర్.. షివర్

'ఎట్టకేలకు ఇప్పుడు చలికాలం వచ్చింది' అంటూ నగరవాసి సయ్యద్ ఫర్జాన్ ఖాద్రి ట్వీట్ చేయడం పట్టణవాసుల్లో చలి పట్ల ఫీలింగ్స్‌కి ఓ నిదర్శనం. శీతలం గుప్పిట్లో చిక్కిన నగరంలో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. శివార్లలోని పలు ప్రాంతాల్లో టెంపరేచర్ సింగిల్ డిజిట్‌కి పడిపోయింది. నగరంలోనూ చలి తీవ్రత బాగా పెరిగింది. డిసెంబర్ నెలలో ముఖం చాటేసిన వింటర్ వేవ్.. అకస్మాత్తుగా జనవరిలో తిరిగి రావడం సిటిజన్లలో కొందరికి కొత్త సరదాలు పుట్టిస్తుంటే మరికొందరిలో రోగాలను తిరగబెట్టిస్తోంది.

- సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు
- పెరిగిన చలితో ఒకటే వణుకు
- రోగాలతో ఆసుపత్రుల్లో చేరికలు
- జాగ్రత్తలు అవసరమంటున్న వైద్యులు



సాక్షి, సిటీబ్యూరో: ఇప్పటికే నగరంలో ఆస్తమా రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరో వైపు జ్వరం శ్వాసకోశ వ్యాధులు విజృంభిస్తున్నట్లు ఆసుపత్రుల్లో రికార్డులు చెబుతున్నాయి. ఈ పరిస్థితి కనీసం మరో 5 రోజుల పాటు కొనసాగనుందని వాతావరణ శాఖ చెబుతుండడం నగరవాసుల్ని వణికిస్తోంది. రాత్రి ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలకు అటూ ఇటూగా నమోదవ్వడం అవకాశాలున్న నేపథ్యంలో ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కిమ్స్ వైద్యుడు డా.శివరాజు సూచిస్తున్నారు.

బాధితులూ బహుపరాక్..

- 60 ఏళ్లు పైబడిన వారిలో వారం రోజులుగా ఇన్ఫెక్షన్లు తీవ్రంగా పెరుగుతున్నాయి. సైనస్లూతో ఐసీయూలలో చేరుతున్న పరిస్థితి కూడా కనిపిస్తోంది. వయసులకతీతంగా వైరల్ ఫీవర్స్ పెరిగాయి. చిన్నపిల్లల్లో కూడా వస్తున్నాయి కానీ అంత తీవ్రత లేదు. టీనేజర్లలో జ్వరం, దగ్గు, తలనొప్పి, ఒళ్లునొప్పులు లాంటివి పెరిగాయి.
- ఈ పరిస్థితుల్లో వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఫ్లూ వ్యాక్సిన్ కూడా తీసుకోవాల్సి వస్తే తీసుకోవాలి. అనవసర చేసే ప్రయాణాలు మానుకోవాలి. రద్దీలో తిరిగేటప్పుడు మాస్కులు ధరించాలి. చల్లటి పదార్థాలకు దూరంగా ఉండాలి. తెల్లవారుజామున నడక అలవాటు ఉన్నవారు బాగా ఆలస్యంగా ప్రారంభించాలి. పొగతాగే అలవాటు ఉన్నవారు బాగా తగ్గించాలి. ఈ ఏడాది ఇంకా ఫ్లూ వ్యాక్సిన్ తీసుకోని వారు తప్పకుండా తీసుకోవాలి.
- ఈవెనింగ్ షిఫ్టుల్లో పని చేయాల్సి వచ్చిన వారు తిరిగి వెళ్లేటప్పుడు బాగా కేర్‌ఫుల్‌గా ఉండాలి. నాలుగ్గోడల మధ్య ఏసీ గదుల్లో పని చేసేవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. ఇంట్లో ఒక్కరికి ఇన్ఫెక్షన్ వచ్చినా మిగిలిన వారంతా అప్రమత్తం కావాలి. ఈ సీజన్‌లో విటమిన్ 'డి' లోపం ఉంటే సరిచేసుకోవాలి. పగటి వేళ సూర్యరశ్మి శరీరానికి బాగా తగిలేలా చూసుకోవాలి. నగరంలో కొన్ని ఇళ్లలో ఆయా ప్రాంతాలను బట్టి గ్రీనరీ ఎక్కువ ఉండే కమ్యూనిటీల్లో విపరీతమైన చలి ఉండే అవకాశం ఉంది. అలాంటి ఇళ్లలో అవసరాన్ని బట్టి తక్కువ ధరల్లోనే లభ్యమవుతున్న హీటర్స్ ఉపయోగించాలి.

పార్టీలు ఫుల్..

ఓ వైపు కొందరు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతుంటే మరోవైపు అనుకోకుండా వచ్చిన వింటర్‌ని ఫుల్‌గా ఎంజాయ్ చేస్తున్నారు మరికొందరు. ఫార్మ్‌హౌస్‌లలో ఓపెన్ బార్బెక్యూలు, లిక్కర్ పార్టీలు అకస్మాత్తుగా ఊపందుకున్నాయి. మల్లేపల్లికి చెందిన ఓ దుస్తుల దుకాణం యజమాని సయ్యద్ అఖిఫ్ మాట్లాడుతూ వింటర్ వేర్‌కి అకస్మాత్తుగా డిమాండ్ పెరిగిపోయిందని చెప్పాడు. స్వెట్టర్లు, జాకెట్స్ స్టాక్ అయిపోయాయంటున్నాడు.

'సోషల్' కూల్

- సోషల్ మీడియాలో కూల్ వెదర్ హీట్ పుట్టిస్తోంది. చలిలో వణుకుతున్న ఫొటోలను కొందరు షేర్ చేస్తున్నారు. మరికొందరు చలిని కొలిచే సాధనాలతో తమ తమ ప్రాంతాల్లో ఉన్న చలి తీవ్రతను పంచుకుంటున్నారు. తన థర్మోస్ హైగ్రో క్లాక్ ద్వారా 7.3 డిగ్రీల సెల్సియస్ ఉందని గుర్తించినట్టు కొండాపూర్‌లో బొటానికల్ గార్డెన్ ప్రాంత నివాసి ఒకరు ట్విట్టర్లో పోస్ట్ చేశారు. అలాగే సిఖ్ విలేజ్ సికింద్రాబాద్‌లో థర్మోమీటర్ 12–13 డిగ్రీల సెల్సియస్ చూపిస్తున్న చిత్రాన్ని మరో నగర వాసి పోస్ట్ చేశారు. ఇక నగర వాతావరణాన్ని పోలుస్తూ సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువై చక్కర్లు కొడుతున్నాయి.

కలెక్టరేట్‌లో కదలిక

- అధికారుల్లో చలనం
- ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆఫీసుల్లోనే..
- చర్చనీయాంశంగా 'సాక్షి' విజిట్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'సాక్షి' విజిట్ చర్చనీయాంశంగా మారింది. 'సారు.. లేరు' శీర్షికన విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరును ఎత్తి చూపిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ సహా జిల్లాస్థాయి అధికారులంతా మంగళవారం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. సోమవారం ఖాళీగా కనిపించిన ఆయా శాఖల అధికారుల కుర్చీలు కళకళలాడాయి. ఉన్నతాధికారులతో పాటు ఆఫీసు సిబ్బంది ఏ ఒక్కరు కలిసినా 'సాక్షి' విజిట్‌పైనే చర్చించుకోవడం విశేషం. ఒకరిద్దరు మినహా జిల్లా అధికారులు, వివిధ సెక్షన్లలోని సిబ్బంది అంతా ఉదయం నుంచి నుంచి సాయంత్రం వరకు ఆఫీసులోనే ఉండిపోయారు. వివిధ పనుల కోసం కలెక్టరేట్‌కు చేరుకున్న వారు అధికారులు అందుబాటులో ఉండడం చూసి హర్షం వ్యక్తం చేశారు.

రేపటి నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు


సబితారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నేతలు

మహేశ్వరం: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా మహేశ్వరం మండలం పెండ్యాల జెడ్పీ హెచ్ఎస్‌లో ఈ నెల 12, 13 తేదీల్లో జిల్లాస్థాయి 21వ కబడ్డీ చాలెంజ్ కప్ – 2022 పోటీలు నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజునాయక్, సరిత డెయిరీ ఆర్థిక సౌజన్యంతో నవభారత్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించనున్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 6గంటల వరకు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. విజేత జట్టుకు రూ. 30వేల నగదు బహుమతి, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 15వేలు, తృతీయ జట్టుకు రూ.10 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 5వేల నగదు బహుమతి ఇవ్వనున్నారు. ఎంట్రీ ఫీజు రూ. 500 చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు, నవభారత్ యూత్ సభ్యులు కోరారు. ఈ పోటీల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎంపీ జీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. మంగళవారం పాఠశాల మైదానంలో పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ల 9010304905, 9848138674లో సంప్రదించాలని నవభారత్ యూత్ క్లబ్ సభ్యులు కోరారు.

మంత్రికి ఆహ్వానం

కబడ్డీ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని మంత్రి సబితారెడ్డికి మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఆహ్వాన పత్రికను అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, మండల అధ్యక్షుడు రాజు నాయక్, ఎన్డీ తండా సర్పంచ్ ఎం రాజు నాయక్ తదితరులు ఉన్నారు.

‘డబుల్’ లక్కు ఎవరికో?

ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల కల త్వరలో సాకారం కానుంది. పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ డబుల్ ఇళ్లకు శ్రీకారం చుట్టారు. సొంతగూడు లేని వారు రెండు పడకల ఇళ్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆ సమయం రానే వచ్చింది. మండల కేంద్రమైన నందిగామ గ్రామ పంచాయతీలో 120 ఇళ్లు అందుబాటులోకి వచ్చాయి. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మాత్రమే మిగిలింది.


నందిగామలో పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లు

120 ఇళ్లు..
459 దరఖాస్తులు

- లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక
- ఆ దిశగా కసరత్తు చేస్తున్న అధికారులు
- ఆశగా ఎదురు చూస్తున్న జనం

నందిగామ: మండల కేంద్రమైన నందిగామ గ్రామ పంచాయతీకి రాష్ట్ర ప్రభుత్వం 120 డబుల్ బెడ్ రూం ఇళ్లను మంజూరు చేసింది. గ్రామ శివారులోని సర్వే నంబర్ 1414లో 1.19 ఎకరాల్లో 5 బ్లాకుల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఒక్కో బ్లాక్‌లో 24 చొప్పున 120 ఇళ్లు నిర్మించారు. రెండేళ్ల క్రితమే మీ సేవ ద్వారా మహిళల పేరుతోనే ప్రభుత్వ దరఖాస్తులు స్వీకరించింది. నందిగామ తోపాటు అనుబంధ గ్రామాలైన జంగోనిగూడ, చంద్రాయన్‌గూడ, పిట్టలగూడ, బండకుంట తండా, అంతిరెడ్డిగూడ, అయ్యప్పస్వామి కాలనీ తదితర ప్రాంతాలకు చెందిన 459 మంది పేదలు డబుల్ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నారు.

దరఖాస్తుల వడబోత

120 ఇళ్లకు గాను 459 మంది దరఖాస్తు చేసుకోవడంతో మండల అధికారులు వాటిని పరిశీలిస్తున్నారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి దరఖాస్తు చేసుకున్న వారు అర్హులేనా, వారు వాస్తవంగా నిరుపేదలేనా.. వారికి ఎలాంటి ఆస్తులు, ఇళ్లు, స్థలాలు లేవా అని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల్లో 50శాతం మేర అనర్హులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

ఎంపిక ఇలా..

వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం అర్హులను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారి పేర్లను చిట్టీలు వేసి బహిరంగంగా లక్కీ డ్రా తీసి తుది జాబితాను ప్రకటిస్తారు.

జోరుగా విద్యుత్, డ్రైనేజీ పనులు

సంక్రాంతి పండుగ తర్వాత డబుల్ బెడ్ రూం ఇళ్లకు లక్కీ డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేయనున్న నేపథ్యంలో ఇళ్లకు విద్యుత్, డ్రైనేజీ పనులు జోరుగా సాగుతున్నాయి.

లక్కు ఎవరికో..

లబ్ధిదారులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయనుండడంతో దరఖాస్తు దారులు ఆ అదృష్టం ఎవరికి దక్కుతుందోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. నిష్పక్షపాతంగా బహిరంగ ప్రదేశంలో దరఖాస్తుదారుల పేర్లు లక్కీ డ్రా ద్వారా తీయనున్నారు. ఏ రోజు లక్కీ డ్రా తీస్తారోనని పేదలు నిరీక్షిస్తున్నారు.

అర్హులకే అవకాశం



డబుల్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తాం. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటాం. జిల్లా అధికారుల సూచనల మేరకు లక్కీ డ్రా తేదీని ముందుగానే ప్రకటిస్తాం. అనంతరం దరఖాస్తుదారుల సమక్షంలో లక్కీ డ్రా తీస్తాం. ఇందులో ఎలాంటి అనుమానాలు, అపోహలకు తావులేదు.
– అబ్దుల్ రెహమాన్ ఖాన్, తహసీల్దార్, నందిగామ

త్వరగా ఇళ్లు కేటాయించాలి



డబుల్ బెడ్ రూం ఇళ్లకు వీలైనంత త్వరగా లక్కీ డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేయాలి. అనర్హులకు అవకాశం ఇవ్వరాదు. పేదలకు ఇళ్లు ఇస్తే వారి కుటుంబానికి నీడ దొరుకుతుంది. ఆ దిశగా అధికారులు చొరవ తీసుకోవాలి. **– బాలమణి, జంగోనిగూడ**

ఇది చాలా గొప్ప విషయం



నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించడం చాలా గొప్ప విషయం. పేదల ఆశలకు అనుగుణంగా వారి సొంతింటి కల నెరవేర్చాలని సీఎం కేసీఆర్ డబుల్ ఇళ్లకు శ్రీకారం చుట్టారు. ఇది పేదల అదృష్టం. వీలైనంత త్వరగా ఇళ్లు కేటాంచాలి. **– లక్ష్మి, నందిగామ**

రైతు రుణమాఫీ చేయకుంటే ఆందోళనే

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీఆర్ఎస్ తాము అధికారంలోకి వస్తే రైతులకు లక్ష లోపు పంట రుణాలను ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలో వచ్చి నాలుగేళ్లు పూర్తయినా ఇంత వరకు అమలు కాలేదని ఆరోపించారు. విత్తనాలు, ఎరువులు, సాగు ఖర్చులు పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో రుణమాఫీ చేసి ఉంటే రైతులకు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. మాయ మాటలతో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక


నియామక పత్రం అందజేస్తున్న గోవింద్‌నాయక్

షాద్‌నగర్ టౌన్: తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఎంఆర్‌సీలో టీజీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్‌నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా రాంచందర్ నాయక్, జిల్లా అధ్యక్షుడిగా సూర్యనాయక్, జిల్లా ఉపాధ్యక్షుడిగా పున్యా నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా తావుర్యా నాయక్, కోశాధికారిగా నీల్యానాయక్, అసోసియేట్ అధ్యక్షుడిగా శంకర్‌నాయక్, కార్యదర్శులుగా వెంకట్‌రాంనాయక్, లోక్యా నాయక్, సంయుక్త కార్యదర్శిగా రెడ్యానాయక్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా పద్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్‌నాయక్ నియామకపత్రాన్ని అందజేశారు.

‘ప్రైవేటు’లో రిజర్వేషన్లు కల్పించాలి

ఆర్.కృష్ణయ్య డిమాండ్

గన్‌ఫౌండ్రీ: ప్రైవేటు విశ్వ విద్యాలయాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ప్రైవేటు విశ్వ విద్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ.. బషీర్‌బాగ్‌లోని విద్యాశాఖ మంత్రి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ప్రైవేటు కళాశాలలను విశ్వ విద్యాలయాలుగా మారుస్తూ రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతున్నాయని, ఓ పథకం ప్రకారం.. సాంకేతిక విద్యాశాఖలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు రిజర్వేషన్లు అందకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లోనూ బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు.

మెరుగైన రవాణాతో పట్టణాల అభివృద్ధి

ఎమ్మెల్యే జైపాల్ యాదవ్


విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

తలకొండపల్లి: మెరుగైన రవాణా సదుపాయంతో పట్టణాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మంగళవారం తలకొండపల్లి రోడ్డు విస్తరణ పనులపై ఎమ్మెల్యే ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు బీఆర్ఎస్ నాయకులతో కలసి రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తలకొండపల్లి నుంచి ఆమనగల్లు వరకు 18 కి.మీ రోడ్డు విస్తరణ పనులకు రూ. 37కోట్లు మంజూరైనట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. అలాగే తలకొండపల్లి క్రాస్ రోడ్డు, వెల్‌జాల్ మలుపు వద్ద 100 అడుగుల విస్తీర్ణంతో రెండు జంక్షన్లు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్ల విస్తరణలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. అలాగే మండల కేంద్రంలోని 6, 7 సర్వే నెంబర్లలో అర్హులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. మండలానికి 500 ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. సొంత స్థలం ఉన్న వారు ఇళ్లు నిర్మించుకునేందుకు నిధులు విడుదల చేస్తామని తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఇద్దరు వైద్యులు విధుల్లో లేకపోవడంతో ఆరా తీశారు. జిల్లా కేంద్రంలో జరిగే సమావేశానికి వెళ్లారని సిబ్బంది తెలిపారు. డీఎంహెచ్‌ఓకు ఫోన్ చేసి సమావేశంపై ఆరా తీశారు. అలాంటిదేమీ లేదని డీఎంహెచ్ఓ.. ఎమ్మెల్యేకి వివరించారు. రిజిస్టర్‌లో ఇద్దరు వైద్యులకు గైర్హాజరు వేశారు. సిబ్బంది తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు ప్రాణదాతలని, బాధ్యతగా పని చేయాలన్నారు. అనంతరం కేజీబీవీని సందర్శించారు. భోజనం గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవనానికి రంగులు వేయడానికి రూ. 5లక్షలు, తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సిమెంట్ వేయడానికి మరో రూ. 5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీకాంత్, తహసీల్దార్ కృష్ణ, డీఈ షర్మిల, ఏఈలు కతారియా, రాకేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్, మాజీ ఎంపీపీ శ్రీనివాసు యాదవ్, జెడ్పీ కో–ఆప్షన్ ఎండీ ముజఫర్ రెహమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాసురెడ్డి, రైతుబంధు మండల కో–ఆర్డినేటర్ నర్సింహ, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్యాంసుందర్‌రెడ్డి, ఈశ్వర్ నాయక్ పాల్గొన్నారు.

కారుతో ఢీకొట్టి.. ఆపై దాడి చేసి..



కారుతో ఢీకొట్టినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలు

వ్యక్తిపై కార్పొరేటర్ భర్త దాడి

- సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు
- ఒకరిపై ఒకరు ఫిర్యాదు
- ఇరువురిపై కేసు నమోదు చేసిన పోలీసులు

మీర్‌పేట: బైక్‌పై వెళుతున్న వారిని కార్పొరేటర్ భర్త కారుతో ఢీకొట్టి ఆపై దాడి చేసిన ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మీర్‌పేట 28వ డివిజన్ కార్పొరేటర్ జిల్లెల అరుణ భర్త ప్రభాకర్‌రెడ్డి సోమవారం రాత్రి కారులో ఇంటికి బయలుదేరాడు. అదే సమయంలో న్యూ బాలాజీనగర్‌కు చెందిన బలరామకృష్ణ మీర్‌పేట చౌరస్తా నుంచి మరో వ్యక్తి డానియల్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. శివసాయినగర్ కాలనీ పార్కు వద్దకు రాగానే ప్రభాకర్‌రెడ్డి తన కారుతో బలరామకృష్ణ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరూ కిందపడ్డారు. దీంతో బలరామకృష్ణ, ప్రభాకర్‌రెడ్డిల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రభాకర్‌రెడ్డి.. బలరామకృష్ణపై దాడి చేయడంతో స్వల్ప గాయాలయ్యాయి. తనపై దాడి చేసిన ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బాలరామకృష్ణ మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నన్ను, నా భార్యను బలరామకృష్ణ బూతులు తిట్టాడని ప్రభాకర్‌రెడ్డి కూడా ఫిర్యాదు చేశాడు. ఇద్దరూ ఒకే పార్టీకి చెందిన వారు కావడం విశేషం. ఇరువురి ఫిర్యాదులు స్వీకరించి కేసులు నమోదు చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.


గాయపడిన బాలరామకృష్ణ

పరస్పర ఆరోపణలు

తనను చంపేందుకే ప్రభాకర్‌రెడ్డి కారుతో ఢీకొట్టాడని బాలరామకృష్ణ ఆరోపించారు. గతంలో కూడా ఇలాగే చేస్తే మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కాగా తనపై రాజకీయంగా బురద జల్లేందుకే బాలరామకృష్ణ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రోడ్డుకు ఎడమ వైపు కుక్క పిల్లలు ఉండడంతో వాటిని తప్పించబోయి కుడివైపు వస్తున్న బలరామకృష్ణ ద్విచక్ర వాహనాన్ని ప్రమాదవశాత్తు ఢీకొనడం జరిగిందని తెలిపారు. అంతేగానీ ఇందులో ఎలాంటి కుట్ర కోణం లేదన్నారు. కావాలనే బలరామకృష్ణ నన్ను, నా భార్యను బూతులు తిట్టాడని జిల్లెల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

షాద్‌నగర్ రూరల్: ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కడియాల కుంట తండా సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బూరుగడ్డ తండాకు చెందిన శంకర్‌నాయక్ (49) ఉదయం ట్రాక్టర్‌తో పొలం పనులు చేసేందుకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వస్తుండగా ట్రాక్టర్‌కు అమర్చిన ఇనుప చక్రాల కారణంగా వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శంకర్ నాయక్ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి భార్య మోతీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నవీన్‌కుమార్ తెలిపారు.

భార్యతో గొడవపడి భర్త అదృశ్యం


మహేష్(ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: భార్యతో గొడవపడిన భర్త కనిపించకుండాపోయిన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ లక్ష్మీనారాయణ కథనం ప్రకారం.. కొంగరకలాన్‌కు చెందిన పద్మమ్మ ముడియ్యప్ప దంపతులు. పాత ఇనుప సామాను వ్యాపారం చేస్తున్నారు. ఈ నెల 6న ముడియ్యప్ప దుకాణం వదిలేసి బయటికి వెళ్లాడు. ఎక్కడికి వెళ్లావని భార్య పద్మమ్మ భర్తను నిలదీసింది. దీంతో ఇద్దరు గొడవపడ్డారు. 7వ తేదీ ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన ముడియ్యప్ప తిరిగి రాలేదు. దీంతో భార్య ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.